జీవాలు నిలిపి..భూసారం పెంచి!

- పొలంలో గొర్రెల మంద నిలపడం ద్వారా అనేక ప్రయోజనాలు
- తగ్గనున్న రసాయన ఎరువులు, మందుల భారం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- జీవాల విసర్జితాలతో నేల సారవంతం, అధిక దిగుబడులు



దబ్బ్యా గోవిందిన్నె గ్రామ పొలాల్లో జీవాలను ఉడిగించిన దృశ్యం

దొర్నిపాడు: అధిక దిగుబడుల కోసం ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్న రసాయన ఎరవులు, మందుల వల్ల భూములు సారాన్ని కోల్పోయి నిర్జీవమవుతున్నాయి. ఈ విధానాన్ని స్వస్తి పలకకపోతే భవిష్యత్తులో నేలలు పంటసాగుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును గ్రహించిన కొందరు రైతులు భూసారాన్ని పెంచి నాణ్యమైన దిగుబడులు తీసేందుకు సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఎక్కువగా వేసవి దుక్కులకు ముందు గొర్రెల మందను తమ పొలాల్లో ఉడిగించుకుంటారు (నిలుపుకుంటారు).జీవాల విసర్జితాలు భూసారం పెంచడంతో పాటు పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడతాయని కర్షకులు భావిస్తున్నారు.

తగ్గని ఆదరణ

పంట కోతల అనంతరం గ్రామీణ ప్రాంతాలకు గొర్రెకాపరులు పుల్లరి చెల్లించి జీవాలను మేతకు తీసుకువస్తారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు పొలాల్లోనే ఉంటూ వారు జీవనం సాగిస్తూ ఉంటారు. భూసారం పెంచుకునేందుకు కొందరు రైతులు వారితో మాట్లాడుకుని వేసవి దుక్కులకు ముందే గొర్రెల మందను తమ పొలాల్లో రాత్రివేళల్లో ఉడిగించుకుంటారు. దీంతో తెల్లారేసరికి వాటి విసర్జితాలతో పొలమంతా నిండిపోతుంది. ఆ తర్వాత రైతులు వెంటనే దున్నడం ద్వారా పొలంలో పెంటికలు కలిసిపోయి భూసారం పెంచుతాయి. ప్రస్తుతం రసాయన ఎరువుల భారం తగ్గించుకోవడానికి గొర్రెల సంఖ్యను బట్టి ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వెచ్చించి సేంద్రియ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. దీని వల్ల నేల సారవంతం కావడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు.

ఖర్చుల భారం తగ్గుతుంది



పొలాల్లో గొర్రెలు, మేకల మందలు వేసుకోవడం వల్ల పొలానికి ఎంతో మేలు జరుగుతుంది. జీవాల విసర్జితాలు వేసిన పొలంలో మంచి దిగుబడులు చూశాం. అందుకు రసాయన ఎరువుల కంటే మందను ఉడిగించడం చాలా మంచిదనిపిస్తుంది. నేల స్వభావం కూడా దెబ్బతినకుండా ఉంటుంది.

–కృష్ణారెడ్డి, రైతు, దబ్బ్యా గోవిందిన్నె

ఆదరణ పెరుగుతోంది



ప్రతి ఏటా రూ. లక్షలు చెల్లించి పొలాల్లో మేత కోసం మందను తీసుకొని వలస వస్తాం. గతంలో రైతులు మందను ఉడిగించుకునేప్పుడు భోజనంతో పాటు డబ్బులు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం మా వంటలు మేమే చేసుకుంటన్నాం. రైతులు ఇచ్చే డబ్బులు సరిపోకపోయినా ఆదరణ మాత్రం అలానే ఉంది. రాత్రివేళల్లో పొలాల్లోనే జీవాలతో కలిసి మేము నిద్రిస్తాం.

–గంగరాజు, కొరైలకాపరి, కొండమనాయునిపల్లె

గొర్రెల విసర్జితాలు ఎంతో మేలు



ఆధునిక వ్యవసాయ రంగంలో నేటికి రైతులు పూర్వపు పద్ధతులు పాటించడం అభినందనీయం. ఎందుకంటే ఇప్పటికీ రైతులు గొర్రల మందను ఉడిగించడం సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టినట్లే. రసాయన ఎరువులు వాడటం ద్వారా నేల స్వభావం దెబ్బతిని భవిష్యత్తు తరాలు పంటలు పండించేందుకు వీలుకాదు. జీవాల విసర్జితాలు పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడటమే కాక నేలను సారవంతం చేస్తాయి.

–ప్రమీల, వ్యవసాయాధికారిణి, దొర్నిపాడు

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని దాతల సహకారంతో చలివేంద్రాన్ని శుక్రవారం డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు అలసంద పల్లి చెన్నయ్య, మంగమ్మ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్లాను ప్రసన్నం చేసుకునేందుకు దీక్షలు



ఇఫ్తార్ ఆత్మీయ సమావేశంలో ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): అల్లాను ప్రసన్నం చేసుకునేందుకు రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు కఠోర ఉపవాసదీక్షలు ఉంటారని జమాతే ఇస్లామి రాష్ట్ర సలహా మండలి సభ్యుడు సుభాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక క్యాంపస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఇఫ్తార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండువేసవిలో చుక్క నీరు ముట్టకుండా ప్రార్థిస్తే అల్లా కరుణిస్తారని నమ్మకమన్నారు. క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మన్నెం దానయ్య, జకరియా, ఖలీల్ ఆరీఫ్, ఉస్మాన్, అన్సార్, సిద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలను విడదీయకండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు

ఉయ్యాలవాడ: వర్గీకరణ పేరుతో మాల, మాదిగ కులాలను విడదీయరాదని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కోగిల ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ర్యాలీగా ప్రధాన వీధుల గుండా నడుచుకుంటూ వెళ్లి రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల పంతం చంద్రబాబు పాలనకు అంతమని పేర్కొన్నారు. స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీలను విభజించడం దుర్మార్గమన్నారు. దళితుల మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చు పెడుతుందన్నారు. కార్యక్రమంలో ఓబులేస్, రవి, పుల్లన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు 380 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో గృహ నిర్మాణాలకు 20 గ్రామ పంచాయతీల నుంచి 380 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు హౌసింగ్ ఏఈ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. వివిధ దశల్లో 220 గృహాల నిర్మాణాలు మ ధ్యలో ఆగిపోయినట్లు పేర్కొన్నారు. వీటిని ర్మాణాలకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహా యం అందిస్తుందన్నారు.ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ఫాల్కన్ బేస్ క్యాంప్ వద్ద మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు

రుద్రవరం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన అటవీ సిబ్బందితో కలిసి రుద్రవరం రేంజి గండ్లేరు రిజర్వాయరు సమీపంలోని ఫాల్కన్ బేస్ క్యాంప్ వద్ద మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల విస్తీర్ణం తగ్గిపోతుండటంతో వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. దీంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, సకాలంలో వర్షాలు కురవకపోవడం జరుగుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు.అలాగే అడవులకు నిప్పు పెట్టడం, జంతువులను వేటాడం వంటివి మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి , రామక్రిష్ణ, ఎఫ్‌బీఓలు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. కామేశ్వరీ, మహానందీశ్వర ఉత్సవమూర్తులను వేద పండితులు, అర్చకులు విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ పూజలు జరిపించారు.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై సికింద్రాబాద్‌కు చెందిన ఎస్.మృణాలిని వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆనంద నర్తన గణపతిం, శంకరశ్రీగిరి, ఓం నమశివాయ, శివతాండవం తదితర గీతాలకు శ్రావణి, తన్వి, గోవింద్, వేద, గంగాశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

ఖరీఫ్‌లో పొలాలను ఖాళీగా ఉంచొద్దు



శిక్షణ కార్యక్రమంలో డీఏఓ మురళీకృష్ణ

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ సీజన్‌లో పొలాలను ఖాళీగా ఉంచుకుండా ఏదో ఓ పంట సాగు చేయాలని డీఏఓ మురళీకృష్ణ రైతులకు సూచించారు. గత ఖరీఫ్‌లో కోవెలకుంట్ల డివిజన్‌లో దాదాపు 65వేల హెక్టార్ల పంట పొలాలు ఖాళీగా ఉండటంతో రూ.32 కోట్ల మేర నష్టం జరిగిందన్నారు. రబీలో సాగు చేసే శనగ పంటకు ముందు పొలాలను ఖాళీగా ఉంచడంతోనే రైతులకు నష్టాలు వస్తున్నాయన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శుక్రవారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో మొక్కజొన్న, సజ్జలు, కొర్రలు, సోయాచిక్కుడు వంటి పంటలను శనగ పంట ముందు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వరి ప్రధాన శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రబీలో శనగ పంట పండించే రైతులు ఖరీఫ్‌లో ఏదో ఒక పంట సాగు చేస్తే పొలాలు సారవంతమవుతాయన్నారు. ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ పంటల సాగుతో నేల ఉష్ణోగ్రతను తగ్గించికోవడంతో పాటు పోషకాల లభ్యతను పెంపొందించుకోవచ్చన్నారు. వరిలో విడుదలకు సిద్ధంగా ఉన్న 12 రకాల క్షేత్ర ప్రదర్శనను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు వీక్షించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధాకర్, ఏడీఏలు, పాల్గొన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): 102, తల్లీబిడ్డ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, 102 తల్లీబిడ్డ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవా రం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి ఏడు సంవత్సరాలు అవుతున్నా అమలు కావడం లేదన్నారు. దీనిపై సర్కారు స్పందించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షులు కిశన్‌కుమార్, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, ఖాదర్‌బాషా, వెంకటేశ్వర్లు, రసూల్, రామోజీనాయక్, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి కలిగిన బయో ఉత్పత్తులనే విక్రయించాలి



గోస్పాడులో ఎరువు, పురుగు మందులను తనిఖీ చేస్తున్న అధికారులు

గోస్పాడు: ఎరువు, పురుగుమందుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతి కలిగిన బయో ఉత్పత్తులనే విక్రయించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ ఆదేశించారు. మండల కేంద్రమైన గోస్పాడులో శుక్రవారం వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో ఎరువు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎరువు, పురుగుమందుల దుకాణాల్లో బయో ఉత్పత్తుల అమ్మకాలపై అంతర్గత తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా గోస్పాడులోని పలు దుకాణాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. న్యూ శ్రీకర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సాయి కృష్ణ అగ్రో ఏజెన్సీస్ దుకాణాల్లో బయో ఉత్పత్తుల కంపెనీలకు సంబంధించి అనుమతి పత్రాలను, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, దుకాణంలోని నిలువలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు సమర్పించనందున సుమారు రూ.53 వేల విలువగల బయో ఉత్పత్తుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన రాజు

ఆళ్లగడ్డ: హాస్టల్లో ఉన్న కుమార్తెను చూసి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆళగడ్డ మండల పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన రాజు (39) అనే వ్యక్తి తన కూతురు దొర్నిపాడు మండలం అమ్మిరెడ్డినగరంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదువుతుండటంతో చూసేందుకు శుక్రవారం బయలు దేరాడు. తిరుగు ప్రయాణంలో పేరాయిపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపు తప్పి హైవే సమీపంలో ఉన్న కుంటలో పడ్డాడు. కాగా నీటిలో మృత దేహం తేలగా స్థానికులు రాజుగా గుర్తించారు. ఈమేరకు భార్య మాధవీలత ఫిర్యాది మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సమాజం జాగృతానికి కవిత్వం దోహదం



సమావేశంలో కవితలు చెబుతున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సమాజాన్ని జాగృతం చేసేది కవిత్వం అని కవులు కొప్పుల ప్రసాద్, గంగుల నాగరాజు పేర్కొన్నారు. నంద్యాలలోని ఇంటర్మీడియట్ స్పాట్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచాన్ని జాగృతం చేసేది ఒక కవిత్వమే అని పేర్కొన్నారు. తెలుగు భాష మాధుర్యాన్ని, కవి గొప్పతనాన్ని వినిపిస్తూ పద్యాలాపన చేశారు. తెలుగు అధ్యాపకులు కవితా గానాలు చేశారు. కార్యక్రమంలో కవులు మద్దిలేటి, సూర్యనారాయణ, సుజాత, తెలుగు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఇస్కాన్ టెంపుల్ మందిరం అధ్యక్షుడు రఘువంశస్‌రామ్‌ప్రభు అన్నారు. పట్టణంలో హరేకృష్ణ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శుక్రవారం భగవద్గీత ఆధారంగా విద్యార్థులకు విలువల విద్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న విలువలు వారికి జీవితంలో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాసేశ్వర మాధవదాసు, వననాథ్ ప్రభు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నీటి సంరక్షణకు పటిష్ట చర్యలు

- పెద్ద సంఖ్యలో నీటి కుంటల ఏర్పాటు
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో నీటి సరంక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. పెద్ద సంఖ్యలో నీటి కుంటల పనులను ప్రారంభించాలన్నారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1/3వ వంతు అటవీ భూములు ఉన్నాయని, 14 మండలాల్లో 48 చెంచు గూడెంలలో గిరిజనులు నివసిస్తున్నారని ఆర్ఓఎఫ్ఆర్ కింద ఇచ్చిన పంట పొలాల్లో నీటి నిల్వ కోసం నీటి కుంటల ఏర్పాటుకు అనుమతించాలన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో గిరిజనులకు ఇచ్చిన భూముల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని అనుసంధానం చేసి ఫారంపాండ్ల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం రోజు జిల్లా వ్యాప్తంగా 2,590 ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యానికి గాను 1380 నీటి కుంటల నిర్మాణానికి మంజూరు ఇచ్చామని ఇప్పటివరకు 921 గ్రౌండింగ్ చేయగా 120 పూర్తి చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం పాండ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవడంతో పాటు ఇంకా నిర్మాణం చేపట్టని 1669 ఫారం పాండ్ల గ్రౌండింగ్‌కు రైతులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన గోకులం షెడ్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 150.55 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 146.69 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిల్చామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాము నాయక్, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని కేసీ కెనాల్‌లో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.మృతుడికి 60 ఏళ్లు పైబడి ఉంటుందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తాలూకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

వెంకటస్వామికి నివాళి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగం సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి అప్పరి వెంకటస్వామి అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఉపాధ్యాయుడు పాటుపడాలని యూటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన అప్పరి వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రామ్మోహన్, అరవింద్, గోపాల్, రమణ, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, శేఖర్, రాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాక్షాయని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్‌లో తరగతులకు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పేద ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినులు ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన



ఈద్గా ప్రదేశంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని ఈద్గా మైదానంలో రంజాన్ నమాజ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రం ముల్లా షబ్బీర్ ఆహ్మద్, మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా పరిశీలించారు. సుమారు 10 వేల మందికి పైగా ముస్లింలు రంజాన్ రోజు సమూహిక నమాజ్‌కు హాజరవుతారన్నారు. ఈనేపథ్యంలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో షామియానాలతో పందిర్లు వేసి, తాగునీటిని సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. వీరి వెంట ప్రభుత్వ ఖాజీ యూనుస్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లా షఫి, ముల్లా చాంద్‌బాషా, ఫ్రూట్ షేక్షా, మాలిక్‌బాషా, సప్లయర్స్ యజమాని మాబుపీరా, షాబుల్ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు,క్రమశిక్షణ



ఎన్‌సీసీ కమాండర్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నంద్యాల(వ్యవసాయం): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడుతుందని 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబీ పిలిప్స్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలను సందర్శించి మాట్లాడారు. బాలికలు, బాలురు ఎన్‌సీసీలో ఎన్నో అంశాలు నేర్చుకోవచ్చన్నారు. కర్తవ్యం, ఐక్యత, జ్ఞానం, సాహసకృత్యాలు చేయడం ద్వారా మంచి ఏకాగ్రతను పొందవచ్చన్నారు. అలాగే పై చదువులకు, ఉద్యోగ అవకాశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆయనను ఘనంగా సత్కరించింది, కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, లలితాసరస్వతి, సుబేదార్ దీప్తిసింగ్, రవీంద్రసింగ్, సీఆర్‌బీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించుకుందాం



అడవుల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

కొత్తపల్లి: అడవులను సంరక్షించుకుందామని ఆత్మకూరు ఫారెస్టు రేంజ్ అధికారి రామకోటి అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళాజాతా ద్వారా అడవుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కలపతోపాటు, పండ్లు, విత్తనాలు, వేర్లు తదితర వాటిపై లక్షలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వాటిని మనం రక్షించుకుంటేనే మనల్ని అవి రక్షిస్తాయన్నారు. అడవులను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా అడవులు – ఆహారం నినాదంతో అటవీ శాఖ పనిచేస్తోందన్నారు. అనంతరం కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు శివనాగయ్య, మహేశ్వరమ్మ, కొలనుభారతి ఎఫ్‌బీఓ క్రిష్ణకాంత్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్‌వీఆర్‌లో సాంస్కృతిక ఉత్సవాలు



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న సుదర్శన్‌రావు

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక, సాంస్కృతిక జాతీయ స్థాయి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు అనంతపురానికి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. గత ఏడాది ఉత్తీర్ణులైన డిపార్టుమెంట్ టాపర్స్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.